క్లుప్తంగా

డ్రోన్‌తో అసాంఘిక కార్యకలాపాలకు చెక్



అనకాపల్లి నుంచి తోటాడకు వెళ్లే మార్గం

మునగపాక: మండలంలోని రాజుపేట, టి.సిరసపల్లి, తోటాడ, నాగవరం తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ ఆదేశాల మేరకు పేకాట, కోడిపందాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి తాగడం వంటి అసాంఘిక కార్యకలాపాలను నివారించేందుకు డ్రోన్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎవరైనా ఎక్కడైనా చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే డ్రోన్‌తో గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా గణేష్



ఎస్.రాయవరం: పాయకరావుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా అడ్డురోడ్డుకు చెందిన ప్రసాదుల గణేష్ నియమితులు కావడం పట్ల గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గణేష్‌కు ఈ పదవి వరించిన నేపథ్యంలో స్థానిక యువకులు అడ్డురోడ్డులో శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుర్రం రామకృష్ణ, దమ్ము రాజు, పప్పల శివ, వంగలపూడి గోవిందు, కట్టా అప్పలకొండ, బి. లోవరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో కర్మాగారం ప్రతినిధులు

యలమంచిలి రూరల్: మండలంలోని ములకలాపల్లి మైహోమ్ సిమెంట్ కర్మాగారం ప్రతినిధులు పది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు శనివారం నగదు బహుమతులు అందజేశారు. 8, 9 తరగతుల్లో ప్రతిభ కనబరిచి ఆయా పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా ఒక్కొక్క విద్యార్థికి రూ.8 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు, తృతీయ బహుమతిగా రూ.4 వేల చొప్పున అందజేశారు. ఒక్కొక్క పాఠశాలకు రూ.18 వేల చొప్పున అందజేసి, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్(ఆపరేషన్స్) బి. రామస్వామి, సీనియర్ డీజీఎం (పీఅండ్‌పీ) ఎల్ శ్రీనివాసరావు, సీఎస్‌వో (సెక్యూరిటీ) డి. వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్నాళ్లకు గుర్తొచ్చామా వాన..!



కోటవురట్లలో కురుస్తున్న వర్షం

కోటవురట్ల: చాలా కాలం తర్వాత మండలంలో శనివారం వరుణుడు పలకరించాడు. మే నెల రాకుండానే భానుడు ప్రతాపం చూపి ఎండలు దంచికొడుతుండగా జనాలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగి వడగాల్పులు వీస్తున్నాయి. సుమారు 10 రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఈ తరుణంలో మధ్యాహ్నం 3 గంటలకు వాతావరణంలో మార్పు చోటుచేసుకుని వర్షం దంచికొట్టింది. సుమారు అరగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరైన జనం ఉపశమనం పొందారు.

వేతనాలు పెంచాలని డిమాండ్



దీక్షలలో పాల్గొన్న క్వారీ, క్రషర్ కార్మికులు

అనకాపల్లి టౌన్: పనికి తగ్గట్టుగా వేతనాలు పెంచాలని జిల్లా క్వారీ, క్రషర్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బవులవాడ పంచాయతీ దర్జీనగర్‌లో క్వారీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శానాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, ఏ అప్పలనాయుడు, చవితిన నూకరాజు పాల్గొన్నారు.



సత్యవరంలో పెరుగుతున్న తమలపాకు తోటలు



ఆకుముడత తెగుళ్లు సోకిన తమలపాకు తోటలు



ఏరు తెగుళ్లు సోకిన తమలపాకు తోటలు

తమలపాకు తోటలకు తెగుళ్లు

- పడిపోయిన దిగుబడి
- నష్టపోతున్న రైతులు
- కానరాని ప్రభుత్వ సహకారం

పాయకరావుపేట: తమలపాకు తోటలు తెగుళ్ల బారిన పడడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కూటమి ప్రభుత్వం నుంచి సలహాలు, సూచనలు లేకపోవడంతో సగానికిపైగా దిగుబడులు పడిపోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. మండలంలో సత్యవరం, కొత్తూరు, అరట్లకోట, మంగవరం, మాసాహేబుపేట తదితర గ్రామాల పరిధిలో వెయ్యి ఎకరాల వరకు తమలపాకు తోటలు సాగు చేస్తున్నారు. వీటిపై 1,500 మంది రైతులు జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ నుంచి రోజూ మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. రోజూ రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో ఆయా ప్రాంతాలకు తమలపాకు తరలిస్తుంటారు.

తెగుళ్లతో కుళ్లిపోతున్న తమలపాకు తోటలు

ప్రస్తుతం పందా (150 ఆకులు) రూ.45 ధర ఉంది. ఒక బుట్టకి 20 పందాలు చొప్పున మూడు వేల ఆకులు ఉంటాయి. ఎకరా తమలపాకు తోటకు రూ. 3 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. రెండు సంవత్సరాల పాటు ఉండే తమలపాకు తోటలు ఇంతవరకు ఏపుగా పెరిగి రైతులకు గిట్టుబాటు ధరతోపాటు జీవనోపాధి కలుగుతోంది. కానీ కొంత కాలంగా తమలపాకు తోటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. ఆకుముడత తెగుళ్లు, ఏరుకళ్ల తెగుళ్లు సోకి తోటలు కుళ్లిపోతున్నాయి. ఆకుముడత తెగుళ్లు సోకిన తోటల తమలపాకు ముడుచుకుపోతోంది. అదే విధంగా ఆకుకు రంధ్రాలు పడిపోతున్నాయి. తద్వారా తమలపాకు ఎగుమతికి పనికి రాకుండా పోతుంది. మరికొన్ని తోటలకు తెగులు సోకి ఎర్రగా పండిపోయి పనికి రాకుండా పోతున్నాయి. దాంతో తమలపాకు తోటలే జీవనాధారంగా చేసుకున్న రైతులకు కూలీలకు ఎంతో నష్టం వాటిల్లుతోంది. తెగుళ్ల బారిన పడి తోటలు చచ్చిపోతుంటే, ప్రభుత్వం గాని, సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులు కాని పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. తమలపాకు తోటలు ముడత తెగులుకు ఏరుకుళ్ల తెగులు నివారణకు మందులు తీసుకుని ఉపయోగిస్తున్నప్పటికీ ఫలితం దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు తమలపాకు రైతులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉండగా, వారెక్కడా కనిపించడం లేదని రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమలపాకు సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మందులు కొట్టినా ఫలితం లేదు



నేను అరెకరా భూమిని కౌలుకు తీసుకుని తమలపాకు తోట వేసి రూ.1.25 లక్షల పెట్టుబడి పెట్టాను. తోటకి ఏరు తెగుళ్లు, ఆకు ముడత తెగుళ్లు పడుతోంది. తెగుళ్లకు మందులు కొట్టినా సరే పని చేయడం లేదు. లీటరు రూ.400 చొప్పున తెగుళ్ల మందులను నెలకు రెండుసార్లు కొడుతున్నాం. పురుగు మందులు, గ్రోమోరు ధరలు పెరిగిపోయాయి. ప్రభుత్వ సహకారం గాని, అధికారులు సలహాలు గాని, ఏవిధమైన రాయితీలు లేవు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి తగు సూచనలు, సలహాలు అందించి తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– గంటా శ్రీను, కౌలు రైతు, మాసాహేబుపేట

అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టా



తమలపాకు తోటలు ఏరు తెగులు, ఆకు ముడత తెగుళ్లతో ఉన్నాయి. అప్పులు చేసి ఎకరానికి రూ.3 లక్షల పెట్టబడి పెట్టాం. ఆకులు దిగుబడి లేదు. తద్వారా ఎగుమతి జరగడం లేదు. రైతులు ఎంతో నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు సూచనలు గాని, సలహాలు గాని ఇవ్వలేదు. గతంలో రోజూ వెయ్యి బుట్టలు ఎగుమతి జరిగేవి. తెగుళ్ల కారణంగా కేవలం 200 బుట్టలు తమలపాకు ఎగుమతి జరుగుతోంది. తమలపాకు తోటలపైనే ఆధారపడి కూలీలు, రైతులు, వ్యాపారులు జీవనం గడుపుతున్నారు. ఇప్పుడు తెగుళ్ల రావడంతో ఎంతో నిరాశగా ఉంది. ప్రభుత్వం అధికారులు మాత్రం స్పందించడం లేదు.

– తమ్మిర్సి గంగరావు, తమలపాకు రైతు, సత్యవరం

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు

నక్కపల్లి: అణగారిన వర్గాలకు, దేశానికి బాబు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఉద్దండపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ తదితరులు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబూజీ చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. అట్టడుగు వర్గాల నుంచి వచ్చి దేశానికి ఉప ప్రధాని పదవి చేపట్టారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ బచ్చలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఏ మణిరాజు, పాపారావు, తాతబాబు, నాయకులు సాదిరెడ్డి శ్రీను, గొర్ల గోవిందు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి ఎస్సీ కాలనీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు, వేంపాడు, గొడిచర్ల, నెల్లిపూడి తదితర గ్రామాల్లో బాబూజీ జయంతి ఘనంగా నిర్వహించారు.

కోటవురట్ల: స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలు ఆచరణీయమని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు అన్నారు. రాట్నాలపాలెంలో బాబు జగ్జీవన్‌రామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎంతగానో కృషి చేశారన్నారు. దేశ స్వాతంత్య్ర సాధనలో కీలక పాత్ర పోషించమే కాకుండా రాజకీయంగా ఎన్నో పదవులను అలంకరించారన్నారు. గ్రామీణ కార్మిక ఉద్యమంతో పేదల జీవితాలలో వెలుగులు నింపారన్నారు. అనంతరం కైలాసపట్నం నుంచి లింగాపురం జంక్షన్ వరకు యువజన సంఘం సభ్యులు పాదయాత్రగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ రాంబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీను, మాజీ సర్పంచ్ గంటేడ అప్పారావు, మాజీ ఎంపీటీసీ గంటేడ పాప, ఎస్ఐ రమేష్, గ్రామ పెద్దలు, యువజన సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కైలాసపట్నంలో జగ్జీవన్‌రామ్ వేడుకలను ఘనంగా జరిపారు. మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



ఉద్దండపురంలో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న నేతలు



నక్కపల్లిలో బాబూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



రాట్నాలపాలెంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



కైలాసపట్నంలో నివాళి అర్పించిన మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



వమ్మవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఏటికొప్పాకలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



యలమంచిలి క్లబ్ రోడ్డులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత నేతలు



జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసిన టీడీపీ నాయకులు

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు పాటుపడాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు పాటుపడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. శనివారం స్థానిక బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో దళిత పోరాట ఉద్యమకారుడు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం చేయడంలో జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారన్నారు. 28 సంవత్సరాల వయస్సులోనే ఆయన శాసనమండలికి ఎంపికయ్యారన్నారు. దళితుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, స్థానికులు కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి లక్ష్మణరావు, కాండ్రేగుల జగన్, పిన్నమరాజు రవీంద్రరాజు, ఆడారి రమణ బాబు, పెంటకోట శ్రీనివాసరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: స్వాతంత్య్ర సమర యోధుడు, సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అన్నారు. వమ్మవరం గ్రామంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతాడ మంగ, సీపీఎం నాయకులు యేసు, నూకరాజు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ ఆదర్శప్రాయుడు

యలమంచిలి రూరల్: డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము అభిప్రాయపడ్డారు. ఏటికొప్పాకలో శనివారం జగ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కషి చేసిన గొప్ప వ్యక్తిగా అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సేనాపతి రాము, మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. యలమంచిలి పట్టణం క్లబ్ రోడ్డు దళిత వాడలో జరిగిన కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తలంక చంద్రశేఖర్, దిగుమర్తి నానాజీ, దిగుమర్తి శ్రీను, దిగుమర్తి అప్పారావు, పెదపూడి బండయ్య, దిగుమర్తి కనక పాల్గొన్నారు.

పాయకరావుపేట: దళిత తొలి మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి పట్టణంలో నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి చిట్టిబాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పల్లా విలియంకేరి, చింతకాయల రాంబాబు, గంపల రాజు పాల్గొన్నారు.

ఆవఖండం భూముల్లో ఇళ్ల నిర్మాణాలు

నిలుపుదల చేయాలని పరిరక్షణ సమితి ప్రతినిధుల డిమాండ్

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారి ఆవఖండం భూముల్లో ఇళ్ల నిర్మాణాలను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిలుపుదల చేయాలని ఆవఖండం పరిరక్షణ సమితి ప్రతినిధులు గాడి బాలు, కనిశెట్టి సురేష్‌బాబు, సూదికొండ మాణిక్యం, కొణతాల హరనాథ్‌బాబు కోరారు. శనివారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో వారు మాట్లాడారు. ఆవఖండం భూములపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జాతీయ రహదారి బైపాస్ రోడ్డును మించి ఎత్తుగా చేపట్టిన ఫిల్లింగ్ ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. ఆవఖండంలో గృహాల నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చిన అనుమతులు తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ విషయంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయని, 1990లో అనకాపల్లి పట్టణానికి వచ్చిన వరదలు పునరావృతమైతే పెద్ద ప్రమాదం వచ్చే అవకాశం ఉందన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు



శ్రీరాముని పెళ్లిరాట వేస్తున్న భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాల ముందు భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మునగపాక, నాగులాపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లి, వాడ్రాపల్లి, తిమ్మరాజుపేట, అరబుపాలెం గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ఉత్సవ విగ్రహాలను శుభ్రం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేస్తున్నారు.

గోకులపాడులో పెళ్లిరాట

ఎస్.రాయవరం: గోకులపాడు సీతారామాలయంలో శ్రీరామనవమి వేడుకలు పురస్కరించుకుని శనివారం స్వామివారి పెళ్లిరాట వేశారు. పేరంటాళ్లు ఆచార, సంప్రదాయాలతో రామాలయంలో పెళ్లిరాట వేసి సందడి చేశారు. ఎంపీటీసీ నాగంబోయిన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు అద్దేపల్లి నూకునాయుడు, మాలెం బాబ్జి, శానాపతి సూరిబాబు, నక్కా శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ మెంబర్ అద్దేపల్లి బొజ్జన్న పాల్గొన్నారు.

ఉచిత పాలిసెట్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీధర్

మునగపాక: విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించాలని అనకాపల్లికి చెందిన షిర్డీసాయి లా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ కోరారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్, లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఏకాగ్రత తప్పనిసరన్నారు. సంస్థ అధ్యక్షుడు శిష్టా తమ్మిరాజు మాట్లాడుతూ 25 రోజుల పాటు పాలిసెట్ శిక్షణ ఇస్తామన్నారు. సంస్థ గౌరవాధ్యక్షుడు కేవీ రమణ, లార్విన్ స్కూల్ ప్రిన్సిపాల్ జాహిదా, కోర్సు డైరెక్టర్ ఎం. సత్యనారాయణమూర్తి, మాడెం జోగారావు, ఆడారి సతీష్, నేషనల్ కళాశాల అధ్యాపకుడు సంజీవరావు పాల్గొన్నారు.

పెదగుమ్ములూరులో ఉచిత పాలిసెట్ శిక్షణ



ఉచిత కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

ఎస్.రాయవరం: గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కోచింగ్ సెంటర్లు ప్రయోజనకరంగా ఉంటాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు తెలిపారు. మండల పీఆర్టీయూ ఆధ్వర్యంలో పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ఉచిత పాలిసెట్ శిక్షణ కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేందుకు పదో తరగతి నుంచి మంచి మార్గాలు ఎంచుకోవాలన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త చోడిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న త్రిమూర్తుల రెడ్డి

నర్సీపట్నం : ప్రజలకు పెనుభారంగా మారిన విద్యుత్ ఛార్జీల పెరుగుదలకు కారణమైన స్మార్ట్ మీటర్లను తొలగించాలని టాక్స్ పేయిర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి డిమాండ్ చేశారు. సీఐటీయు కార్యాలయంలో శనివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇంటి పన్నులు, కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదన్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా 15 శాతం నుండి 20 శాతం వరకు ఇంటి పన్నులు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. అనంతరం స్మార్ట్ మీటర్లు తొలగించాలని, ఇంటి పన్ను పెంపు విరమించుకోవాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు గాయత్రి, టాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ శివ నారాయణరాజు పాల్గొన్నారు.

పందిరి విధానంలో పొట్లకాయ సాగు



మర్రివలసలో సాగులో ఉన్న పొట్లకాయ పంట

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో గల రైతులు పొట్ల కాయ పంట సాగుపై ఆసక్తిని చూపుతున్నారు. మూడు నెలల కాలంలో దిగుబడి ప్రారంభమయ్యే పొట్లకాయ పంటను పందిరి విధానంలో రైతులు సాగు చేస్తున్నారు. మర్రివలస, శృంగవరం, గొట్లాం గ్రామాల్లో 30 ఎకరాల్లో సాగవుతోంది. ఇక్కడ పండించిన పంటను విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి ప్రాంతాలలో గల రైతు బజార్లలో విక్రయాలు చేపట్టనున్నట్టు రైతులు తెలిపారు. ఇప్పటికే పంట దిగుబడి ప్రారంభమైందని తెలుపుతున్నారు.

13న పక్షులకు తిండి గింజలు

అనకాపల్లి: వేసవి దృష్టిలో పెట్టుకుని ఈ నెల 13న పక్షులకు తిండి గింజలు (వరి కుంచులు) తాగు నీరు ఉంచే మట్టిపాత్రలు, పక్షుల గూళ్లు పట్టణ పరిధిలోని పార్కుల్లో ఏర్పాటు చేస్తామని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో గొంతు తడుపుకునేందుకు పక్షుల కోసం మీ ఇంటి బయట కాసిన్ని నీళ్లు, గుప్పెడు గింజలు ఉంచాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమస్త జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మాకవరపాలెం: స్థానిక అంబేడ్కర్ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ పోటీలు ప్రారంభించారు. విజేతలకు అంబేడ్కర్ జయంతి రోజున నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.